# ఖూనీ




ఆ కిటికీలోంచి గాలొస్తోంది... కొద్దిగా వెలుగొస్తోంది... ఆలోచనలూ వస్తున్నాయి.

గది నిండా బద్ధకం మత్తుగా కదలకుండా పడుకునుంది.

మంచంమీద పడుకుని కిటికీలోంచి చూస్తున్న రవణకి లేవాలనుంది... మంచం మీంచి... ఆ బద్ధకంలోంచి...

'లేచి...' అనుకున్నాడు -

లేచి చేసే పనేంలేదు. ఇప్పుడే కాదు, తనకి జ్ఞానం వచ్చిం తర్వాత గడిచిన పదిహేనేళ్ళలో తప్పనిసరిగా ఇది చేస్తేనేగాని రోజు గడవదు అనే పని ఏనాడూ లేదు. సమయం ఊరికే కూచోనివ్వదు కాబట్టి ఏదో ఒకటి చెయ్యటం.... అలాగే చదువూ, అంతే. దానిమీద పెద్దగా అయిష్టంలేదు కాబట్టి,

అవకాశం ఉంది కాబట్టి చదవటం.

బస్సెక్కిస్తూ శర్మ అన్నాడు. చుట్టూ జనం... అమ్మకం గోలలు... చప్పుళ్ళు అంత హడావిడిలోను ఆ మాటలు బాగా వినపడ్డాయి...

"ఈ కాలేజీ... చదువు... పరీక్షలు అయిపోటం కోసం, శెలవలకోసం ఎదురుచూట్టం... రిజల్ట్స్ కోసం భయం... ఇదంతా 'డ్రై'గా లేదూ నీకు..." అని.

తనెప్పుడు శెలవల కోసం ఎదురు చూళ్ళేదు. రిజల్ట్స్ కోసం భయపళ్లేదు. అదే అన్నాడు శర్మతో.

ఇన్నేళ్ళ చదువులోనూ తనెందుకు రిజల్ట్స్ విషయం పెద్దగా పట్టించుకోలేదో తెలియకపోయినా శర్మ విషయం తెలిసింది బస్సెక్కే లోపల.

శర్మ భయం రిజల్ట్స్ మీదకాదు, తన తెలివితేటల మీద కాదు. కృషిమీద కాదు. ఉన్న అవకాశం మీద. ఓసారి పరీక్షపోతే మళ్లీ చదివించలేరనే యింటివాళ్ళ ఆర్థిక స్థితిమీద. కాని తనకి ఆ బెంగలేదు. జీవితమంతా చదువుకున్నా చదువుకోగల స్థోమత ఉంది. రెండులక్షల అండ ఉంది.

'శర్మ మళ్లీ కలుస్తాడా'

"బహుశా ఇంక రానిక్కడికి. పాస్ అవుతాననే అనుకుంటున్నాను. ఆ డిగ్రీ పుచ్చుకుని ఏ గుమాస్తాగానో... ఎక్కడో - మరి నువ్వు" అన్నాడు. బస్ స్టార్ట్ అయింది.

"బై... ఆల్ ది విషెస్'

కదుల్తూ కాస్సేపు కనిపించాడు శర్మ. బస్ తనని తీసుకొచ్చి దింపింది ఈ ఊళ్ళో.... వచ్చి వారం కూడా కాలేదు. కాని ఎన్నో రోజులైనట్టుంది ఏం తోచదు.

పుట్టిన ఊరు... కొన్నాళ్ళు పెరిగిన ఊరు... సొంతిల్లు - పొలాలు ఉన్న ఊరు అంతే... అంతకన్నా ఏం లేదిక్కడ...

తెలిసినవాళ్ళు... తోటి వయసు వాళ్ళు కూడా "బాబుగారు" అనే పిలుపు. ఏరా అనుకునే స్నేహితుల్లేరు. ఇల్లు కదలి వెళ్ళటానికి యిష్టమైన వేరే చోటు లేదు.

కిటికీ మరోసారి కదిపింది రమణని మంచం మీంచి.

"బాబుగారూ! గది ఊడవనా"

"ఊ" అన్నాడు తలెత్తి చూడకుండా.

బురద ఎండిపోయిన ఆ వేళ్లు, పాదాలు కదిలాయి. వాటి పైగా వెండి కడియం, నున్నగా, నల్లగా పిక్క... వంకీలా చుట్టుకుపోయిన చీర ఊడుస్తున్న చీపురు అందంగా కదుపుతోంది నాగమ్మని.

నాగమ్మ నల్లగా ఉన్నా బావుంటుంది. అందం కన్నా బలంగా ఉంటుంది.

కాని రాధ.... సన్నగా, పొడుగ్గా ఆ అందం వేరు. కాలేజీకి తలంటు పోసుకొచ్చిన రోజు మరీ బావుండేది. ఈ పాటికి రాధా వెళ్ళిపోయే ఉంటుంది వాళ్ళ ఊరు. ఏ ఊరో తెలియదు తనకి... చూట్టమే తప్ప ఏ ఊరో అడిగి తెలుసుకునే పరిచయం లేదు.

తనతో చదువుకున్న వాళ్లందరూ వాళ్ళ, వాళ్ళ ఊళ్ళలో ఏ పనీ లేకుండా యిలాగే బద్ధకంగా పడుకునుంటారా... ఉండరేమో. వాళ్ళ యిళ్ళల్లో చాలా మందుంటారు. అక్కలు, చెల్లెల్లు, తమ్ముళ్ళు తనకి అమ్మ... అమ్మ కూడా లేదు.

అమ్మ ఎలా పోయిందో... పురిట్లో పోయిందని అత్తయ్య చెప్పిందోసారి.... వాతం వచ్చిందట.

అప్పుడు ఊళ్ళోగాని, చుట్టుపక్కల గాని అందుబాట్లో ఏ డాక్టరూ లేడట... ఉంటే అమ్మ బతికేదా?

ఇప్పటికీ ఈ ఊళ్ళో మంచి డాక్టరు లేడు. ఊరందరికీ మందులిచ్చే చారి... డాక్టరు కాదు. ఎవరి దగ్గరో పని చేసొచ్చిన కాంపౌండర్. అందుకనే మెడిసిన్ చదవాలి చదివి ఇక్కడే -

"ఏమిటిరా ఇంకా లేవలే... పదవుతోంది."

నాన్నతో చెప్పేస్తే. అప్పుడే మెడిసన్ సీటు విషయం. "ఏం లేదు నాన్నా... లేస్తున్నా బద్ధకంగా ఉంటే..."

అస్తమానం యింట్లో కూచుంటే బద్ధకంగా ఉండదూ! లే... లేచి స్నానం, భోజనం చేసి రడీగా ఉండు. ఏలూరు వెళదాం. అక్కడ మన ప్లీడరు గారింట్లో ఫంక్షనుందివాళ..." అన్నారు. ఏమంటావు అన్నట్టు చూస్తూ రంగారావుగారు.

"సరే..." అన్నట్టు తలూపుతుండగానే వెళ్ళిపోయారు.

★ ★ ★

తన వయసువాళ్ళు ఎవరూ ఉండరు, ఇబ్బందిగా ఉంటుంది అనుకున్న రవణకి చాలా ఎంజాయింగా ఉంది ఫంక్షన్. ప్లీడర్గారి కూతురి పెళ్ళి.

తండ్రి ఎవరితోనో మాట్లాడుతున్నా రవణకి ఇబ్బందిగా అనిపించలేదు. ఆవిడ పక్కనే ఉండి ఎన్నో విషయాలు చాలా సరదాగా మాట్లాడుతోంది. "మంచి కంపెనీ..." అనుకున్నాడు. ఇదివరకు ఒకటి రెండుసార్లు చూసినా తండ్రి మళ్ళీ చెప్పేవరకూ ఆవిడెవరో గుర్తు రాలేదు. సరస్వతమ్మ... అని ఏదో చుట్టరికం చెప్పారు రంగారావుగారు.

"ముప్పై ఏళ్ళ మనిషైనా అంత వయసు పరికించి చూస్తేనే కాని కనపడదు' అనుకున్నాడు రవణ.

చుట్టూ చాలా సందడిగా ఉంది. వెళ్లేవాళ్లు వెడుతున్నారు. మాట్లాడుకునేవాళ్లు అక్కడా ఇక్కడా గుంపులుగా మాట్లాడుకుంటున్నారు.

"మీ నాన్నగారు పిలుస్తున్నారు..."

"ఎక్కడ..." అన్నాడు రవణ. ఆవిడ చూపించినవేపు తిరుగుతూ. రంగారావుగారు దగ్గరికి రమ్మన్నట్టు చెయ్యూపితే వెళ్ళాడు. వెనకాలే ఆవిడా వచ్చింది.

"నేను అర్జెంటుగా లక్ష్మయ్యగారితో కలిసి బెజవాడ వెడుతున్నాను. మరి నువ్వేం చేస్తావు ఈ రాత్రికి..."

తండ్రి అలా అనగానే ఏం చెప్పాలో తోచలేదు రవణకి.

"పోనీ ఇక్కడే ఉండు ప్లీడరుగారితో చెపుతాను. పొద్దున్నే వచ్చి తీసికెడతా... మన కారు నేను తీసికెడుతున్నా. ఇప్పుడు బస్సులు కూడా ఉండవు..."

అంత హడావిడిలో ఎవరూ తెలియని చోట ఉండాలని లేదు రవణకి... 'నేను మీతో వస్తా' అని అందామనుకున్నాడు.

"పోనీ మా ఇంటికి తీసుకెడతా... ఒక్కడూ ఇక్కడేం ఉంటాడు. మీరు రేపు వచ్చి తీసుకెడుదురు గాని..." అంది సరస్వతమ్మగారు.

'ఏమంటావు' అన్నట్టు చూశారు రంగారావుగారు.

'తనేమంటాడు. మీరు వెళ్లమనాలి గాని..." అంది ఆవిడే మళ్లీ.

"అలాగే వెళ్ళరా... పొద్దున్నే వస్తా..." అంటూ హడావిడిగా వెళ్లిపోయారు రంగారావుగారు. రవణకి మాట్లాడే అవకాశం దొరకలేదు.

"రా... రవణా!" అందావిడ భుజం మీద తడుతూ.

ఆవిడ వెళ్లి ప్లీడరుగారితో చెప్పి వచ్చింది. ఇద్దరూ బయటికి నడిచారు.

కారు బైలుదేరిన పావుగంట వరకూ ఆవిడే ఏవేవో చదువు గురించి, యింటి గురించి అడుగుతుంటే సమాధానాలు చెపుతూ కూచున్నాడు. అనుకోని ప్రయాణం... కారు బాగా కుదుపుతోంది. చిన్న మట్టిరోడ్డు గతుకులు... డ్రైవరు చాలా నెమ్మదిగా నడుపుతున్నాడు... సన్నగా తుంపర్లు పడుతున్నాయి.

"ఏమిటి... అంత డల్‌గా ఉన్నావు"

"అబ్బే ఏం లేదు... అనుకోకుండా ఈ ప్రయాణం..."

"ఒక్కరాత్రే కదా... తెల్లారితే మీ నాన్న రానే వస్తారు... ఎందుకంత దిగులు..."

"అబ్బే దిగులేం కాదు... మీకు అనవసరంగా శ్రమని..." అన్నాడు. ఏదో ఆవిడ మాట్లాడుతోంది కదా అని మాట్లాట్టం తప్ప నిజంగా ఏం మాట్లాడ్డానికి తోచటంలేదు రవణకి. వర్షం కొద్దిగా ఎక్కువైంది. విండోగ్లాస్ వేస్తూ ఆవిడ కొద్దిగా రవణ వేపు జరిగింది.

"ఈ విండోగ్లాస్ బద్దలయినట్టుంది....." అందావిడ జల్లు ఎక్కువైతే ఇంకొద్దిగా జరుగుతూ. రవణా జరిగాడు తలుపువేపు. అయినా ఆవిడ మీద నీళ్లు పడుతూనే ఉన్నాయి. మెత్తగా ఆవిడ వొళ్లు తగుల్తోంది.

ఆవిడ చిన్నగా నవ్వి మరికొద్దిగా జరిగింది.

"మీ నాన్నగారు నీకు సంబంధాలేం చూట్టం లేదా..." అంది అలాగే నవ్వుతూ.

'పెళ్ళి విషయం ఇంతవరకు తన దృష్టికి రాలేదు. నాన్నగారు సంబంధాలు చూస్తే... వాకబు చేస్తే రాధా వాళ్ల ఊరు తెలుస్తుంది'

"లేదు... ఇంకా చదువు పూర్తి కాలేదుగా" అన్నాడు.

"పెళ్లయితే మటుకు చదువుకోకూడదా..." అందావిడ.

ఏం సమాధానం చెప్పాలో తోచలేదు రవణకి. జవాబు చెప్పినా ఆవిడ మళ్లీ ఏదో ఒకటి అడుగుతుందనిపించింది. కావాలనే ఏదో ఒకటి కల్పించుకు మాట్లాడుతోందా అనుకున్నాడు.

సరస్వతమ్మగారి ఇల్లు చేరేటప్పటికి వర్షం బాగా ఎక్కువయింది. కారు దిగి లోపలి కెళ్లేటప్పటికే సగం పైగా తడిశారిద్దరూ. ఎవరో ముసల్ది తలుపు తీసింది. ఇంట్లో చిన్నచిన్న కిరసనాయిలు దీపాలు వెలిగించున్నాయి.

"ఏం కరంటు లేదా?" అందావిడ.

ముసల్ది సమాధానం చెప్పకుండానే ముందుకి తీసికెళ్లింది రవణని.

★ ★ ★

తెలతెలవారుతుండగా మెలుకువొచ్చింది రవణకి. తన పక్కనే పడుకునున్న ఆవిణ్ణి చూశాడు. ఆవిడే కావాలని లొంగ దీసుకుందో... తనే తన వయసుకి లొంగిపోయాడో అన్న ఆలోచన

రాలేదు రవణకి. నెమ్మదిగా దగ్గరికి జరిగి పడుకున్నాడు. ఆ రాత్రి గడిచినంత తొందరగా అంతవరకూ ఏ రాత్రి గడవలేదనుకున్నాడు మళ్లీ. నిద్రపోబోతుండగా. ఆ రాత్రి రవణని బద్ధకం తినలేకపోయింది.

ఎండ పొద్దెక్కుతుండగా,

"మీ నాన్నగారొస్తారు, లే రవణా" అని నిద్ర లేపిందావిడ.

మత్తుగా కళ్లు తెరిచిన రవణకి లేవాలనిపించలేదు. ఆవిడే బలవంతంగా లేపింది.

నాన్నగారొచ్చినా, నేను యివాళ వెళ్లను" అన్నాడు కాఫీ తాగుతూ నెమ్మదిగా.

నవ్విందావిడ. రాత్రి దార్లో నవ్వినట్టే...

"బావుంది... మా ఆయన కూడా వస్తారు... బావుండదు... ఏదో సరదాగా... అయిపోయింది. అదే మనసులో పెట్టుకోకూడదు. మళ్లీ వీలుంటే నేనే కబురు పెడతాలే..." అంది లోపలికి వెడుతూ.

ఆ తర్వాత గడిచిన ఏడాదిలో రవణ, రాధని మరిచిపోయాడు. మెడిసిన్ సీటు సంగతి తండ్రితో చెప్పటం మరిచిపోయాడు. వాళ్ళ ఊళ్లో మంచి డాక్టరు లేడన్న సంగతీ మరిచిపోయాడు. కానీ ఆరోజు మొదటిసారిగా అనుభవానికొచ్చిన ఆ సరదాని మరిచిపోలేదు.

కొందరి సరదాలు జూదం ఆడతాయి. ఇంకొందరి సరదాలు హత్యలు చేస్తాయి. మరికొందరి సరదాలు తాగుతాయి. వ్యభిచారుల్ని పోషిస్తాయి.

అలాగే ఆవిడ సరదా కూడా రవణని...

- *'జ్యోతి' మాసపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక, 1970*